నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ప్రభుత్వ శాఖలచే చేపడుతున్న నిర్మాణ పనులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు తప్పనిసరిగా తనిఖీ చేసి పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు మందిరంలో శనివారం వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ ప్రసక్తే లేదన్నారు. నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలంటే ఇంజనీరింగ్ అధికారులు తప్పనిసరిగా పనులను తనిఖీ చేసి, పర్యవేక్షించాల్సివుందని అన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్లో నాడు-నేడు కార్యక్రమం కింద నిర్మించిన మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా లేదని, తాళాలు వేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు.

ఉలిక్కిపడ్డ ఏలూరువాసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కేరళలో శబరిమల ప్రాంతంలో చోటుచేసుకున్న బస్సు ప్రమాదంలో ఏలూరు ప్రాంత వాసులు ఉలిక్కిపడ్డారు. అయ్యప్ప మాలధారణలో శబరిమల వెళ్లిన తమ వారు ఎలాగున్నారో అంటూ ఆరా తీశారు. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు మినహా మిగిలిన వారంతా సురక్షితంగా ఉన్నారని సమాచారం అందడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాదానికి గురైన బస్సు

కేరళలో బస్సు ప్రమాదంపై సర్వత్రా ఆందోళన
నలుగురికి తీవ్ర గాయాలు
అక్కడి అధికారులతో మాట్లాడిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
కేరళ ప్రభుత్వ స్పందన తీరుపై దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి హర్షం

ఏలూరు రూరల్ మండలం చాటపర్రు, మాదేపల్లి ప్రాంతాలకు చెందిన 80 మంది అయ్యప్ప మాలధారులు ఈ నెల 15న చిలకలూరిపేటకు చెందిన రెండు ప్రయివేటు ట్రావెల్స్ బస్సుల్లో కేరళ రాష్ట్రంలోని శబరిమల బయల్దేరి వెళ్లారు. వారంతా అయ్యప్పస్వామి దర్శనం పూర్తి చేసుకున్నారు. 80 మందిలో 40 మంది శబరిమలలోనే తమ మాలలను తీసివేశారు. మాలలు తీసివేసిన వారంతా ఒక బస్సులో ఎక్కగా, పంబ నది సమీపంలో మాలలు తీసేందుకు మరో నలభై మంది శబరిమల నుండి తిరుగు ప్రయాణమయ్యారు. శనివారం ఉదయం ఎనిమిదన్నర ప్రాంతంలో పంబ సమీపంలోని పత్తనంథిట చేరుకునేసరికి మాలధారులు ప్రయాణిస్తున్న బస్సు స్టీరింగ్ లోపం తలెత్తింది. ఫలితంగా ఘాట్ రోడ్డు మలుపులో బస్సు మలుపు తిరగకుండా నేరుగా లోయలో పడిపోయింది. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 18 మందికి గాయాలవ్వగా వారిలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని పత్తనంథిట ఆసుపత్రికి తరలించి తీవ్ర గాయాలైన వారిని మెరుగైన చికిత్స నిమిత్తం కొట్టాయం వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆ ప్రాంత ఎంఎల్‌ఎ ప్రమోద్ నారాయణ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అంతా సురక్షితంగా ఉన్నారని, అందరికీ మెరుగైన చికిత్స అందిస్తున్నామని, ఎటువంటి ఆందోళనా చెందొద్దని చెప్పారు.

అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

కేరళలో బస్సు ప్రమాదంలో జిల్లావాసులు గాయపడ్డారనే సమాచారం తెలియగానే జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పత్తనంథిట జిల్లా కలెక్టర్, ఎస్‌పిలతో మాట్లాడి సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కొంతమంది అయ్యప్ప భక్తులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడి వారి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. ప్రమాదంలో గాయాల పాలైన వారి కుటుంబాలను దెందులూరు ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించారు. ఆయన వెంట ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచలకిషోర్, తహశీల్దార్ బి.సోమశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే సిఎం జగన్ అక్కడి ప్రభుత్వంతో మాట్లాడారన్నారు. అక్కడి వైద్యఆరోగ్య శాఖా మంత్రి, ఆ ప్రాంత ఎంఎల్‌ఎ వెంటనే స్పందించి సహాయక చర్యలను పర్యవేక్షించడంతోపాటు క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారన్నారు. కేరళ ప్రభుత్వం స్పందించిన తీరు అభినందనీయమన్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో మణికంఠ (8) కుడికాలికి శస్త్రచికిత్స చేస్తున్నారన్నారు. రాజశేఖర్(33), గోపీ, రాజేష్ కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. తరుణ్‌కు శ్వాస సంబంధిత సమస్య ఉండటంతో మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. బాధితులందరినీ ఏలూరు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న కేరళ ఎంఎల్‌ఎ ప్రమోద్ నారాయణ

అభివాదం చేస్తున్న నేతలు

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై.. ఐక్యంగా ఉద్యమించాలి

సిఐటియు జిల్లా మహాసభలో వక్తల పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రమైన ఏలూరులో మహిళా ఉద్యమ నేత, సిఐటియు నేత జి.విజయలక్ష్మి నగర్‌లో సిఐటియు జిల్లా మహాసభ ప్రారంభ సభ బి.సోమయ్య అధ్యక్షతన శనివారం ఉదయం జరిగింది. తొలుత ఇటీవల మూడేళ్లకాలంలో మృతి చెందిన ఉద్యోగ, కార్మిక సంఘ నేతలకు, కార్యకర్తలకు, అమరవీరులకు సభా ప్రాంగణం బయట ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద సభకు హాజరైన ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులను దగా చేసిందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఒకటి కూడా అమలు చేయలేదని విమర్శించారు. కార్మికులు తమ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామని గద్దెనెక్కిన వైసిపి అధికారం చేపట్టి మూడున్నరేళ్లు దాటినా రద్దు చేయలేదని విమర్శించారు. పిఆర్‌సి విషయంలోనూ సరిగా వ్యవహరించలేదన్నారు. కేంద్రం సంస్కరణల పేరుతో తీసుకొచ్చిన కార్మిక చట్టాల్లో లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నిస్తుందని చెప్పారు. దీనివల్ల కార్మికుల హక్కులు హరించుకుపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన గుర్తు చేశారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.స్వరూపరాణి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం లౌకిక రాజ్యాంగానికి తూట్లు పొడుస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగాన్ని కూడా కాషాయీకరణ చేసేందుకు ప్రయత్నిస్తుందని వాపోయారు. మహిళల హక్కులను కాలరాసేలా అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. మనుధర్మ శాస్త్రాన్ని సమాజంపై బలవంతంగా రుద్ది మహిళలను, దళితులను వివక్షకు గురి చేసేలా బిజెపి ప్రయత్నిస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని కోరారు. కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్నాయని చెప్పారు. సిఐటియు మహాసభల ప్రారంభ సూచికంగా సిఐటియు పతాకాన్ని నాయకులు పల్నాటి సూర్యప్రకాశరావు ఆవిష్కరించారు. రెండు రోజులపాటు సాగే ఈ మహాసభకు బి.సోమయ్య, జి.రాజు, ఎం.దుర్గారావు, కె.పోశమ్మ, పిఎల్‌ఎస్.కుమారి అధ్యక్షవర్గంగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఎపి జెఎసి రాష్ట్ర నాయకులు ఆర్ఎస్.హరనాథ్, ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి కెఎస్.రామారావు, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎల్‌వి.సాగర్, కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు చింతకాయల బాబూరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.సుందరయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.విజయలక్ష్మి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ ఎ.శ్యామలారాణి, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రతినిధుల సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు.

మాట్లాడుతున్న స్వరూపరాణి

ఆర్‌టిసి బస్సు, టిప్పర్ లారీ ఢీ

బస్సు డ్రైవర్ చాకచాక్యంతో తప్పిన పెనుప్రమాదం
నలుగురికి తీవ్రగాయాలు, ఇద్దరికి స్వల్పగాయాలు,
రెండు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆర్‌టిసి బస్సు, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటన శనివారం ఉదయం పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై ముదినేపల్లి-చినపాలపర్రు గ్రామాల మధ్య చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలవ్వగా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

గుడివాడ ఆర్‌టిసి డిపోకు చెందిన ప్యాసింజర్ బస్సు కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం పల్లెపాలెంలో నైట్‌హాల్ట్ చేసి శనివారం ఉదయం ఐదు గంటల సమయంలో అక్కడ నుంచి గుడివాడ బయల్దేరింది. ఈ క్రమంలో ముదినేపల్లి మండలం చినపాలపర్రు సమీపంలోకి బస్సు వచ్చేసరికి గుడివాడ నుంచి బంటుమిల్లి ఇసుక క్వారీకి అతివేగంగా వెళ్తున్న టిప్పర్ ఎదురుగా వచ్చి బస్సును ఢీకొంది. ప్రమాద సమయంలో బస్సులో 58 మంది ప్రయాణికులతోపాటు బస్సు కండక్టర్, డ్రైవర్‌తో సహా మొత్తం 60 మంది ఉన్నారు. దీంతో బస్సు, టిప్పర్ రోడ్డు మధ్య అడ్డంగా నిలిచిపోయాయి. రెండు వాహనాలు ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఒకపక్క రోడ్డు విస్తరణ పనులు, మరోపక్క మురుగుకాల్వ, రోడ్డు సరిగ్గా లేకపోవడం, టిప్పర్ అతివేగంగా రావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. బస్సుడ్రైవర్ చాకచాక్యంతో వ్యవహరించడంతో పెనుప్రమాదం నుంచి ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ కెఎస్.నారాయణ తొడకు తీవ్రగాయమవ్వగా కండక్టర్ కెవి.కొండలుకు ముక్కు, తలపై గాయాలవ్వడంతోపాటు పన్ను విరిగింది. చల్లపల్లికి చెందిన టిప్పర్ డ్రైవర్ నరేంద్రకుమార్ (25)కు కుడికాలు విరిగింది. బస్సులో ప్రయాణిస్తున్న బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడేనికి చెందిన చింతల రంగారావు (50), ముదినేపల్లి మండలం వడ్లాలికి చెందిన కె.జగన్నాథరావు (58), నక్క శ్రీనివాసరావులకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ షణ్ముఖసాయి తన సిబ్బందితో ఘటనాస్థలికి హుటాహుటిన చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వెంటనే పోలీసులు టిప్పర్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను అతికష్టంపై బయటకు తీశారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న రెండు వాహనాలను క్రేన్ సహాయంతో రోడ్డు మార్జిన్‌లోకి తొలగించారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అటంకమూ లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను 108 వాహనంలో గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోయాయి. రెండు కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు స్తంభించిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం తెలుసుకున్న ఆర్‌టిసి గుడివాడ డిపో మేనేజర్ రాజేష్‌కుమార్, అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులను వేరే బస్సుల్లో గమ్యస్థానాలకు పంపే ఏర్పాట్లు చేశారు. ఆర్‌టిసి ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, ఎఐఎం ఎంపిజె.రాజు, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ కె.రత్నం తదితర అధికారులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.



ఆర్‌టిసి బస్సును ఢీకొన్న టిప్పర్ లారీ

రేపు నరసాపురంలో సిఎం పర్యటన సాగేదిలా

ప్రజాశక్తి - నరసాపురం

సిఎం జగన్మోహన్ రెడ్డి ఈనెల 21వ తేదీ సోమవారం ఉదయం 10:50 గంటలకు నరసాపురం చేరుకుంటారు. 10:55 నుండి 11:05 వరకూ ప్రజా ప్రతినిధులతో మమేకమవుతారు. 11:05 గంటల నుంచి నరసాపురం రోడ్డు మార్గంలో బయలుదేరి సభా ప్రాంగణానికి 11:15 గంటలకు చేరుకుంటారు. 12:50కు సభ ముగించుకుని 12:55 గంటలకు హెలీపాడ్ వద్దకు చేరుకుంటారు 12:55 నుండి 01:10 వరకు స్థానిక నేతలతో సంభాషిస్తారు 01:10 గంటలకు నరసాపురం నుండి హెలికాప్టర్లో బయలుదేరి రెండు గంటలకు తాడేపల్లి చేరుకుంటారు.

తరగతి గదులను ప్రారంభిస్తున్న దాతలు, ప్రముఖులు

స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

అమెరికాలో స్థిరపడిన కైకరం పాఠశాల పూర్వ విద్యార్థి తాను చదివిన పాఠశాలలో విద్యా బోధనకు సాంకేతికతను జోడించాలనే సంకల్పంతో కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు ప్రశంసించారు. కైకరానికి చెందిన పూర్వ విద్యార్థి సనపల రామకృష్ణ తాను చదివిన పాఠశాలకు రూ.20 లక్షలు సొంత నిధులు సమకూర్చి, కోట్స్ సంస్థ ద్వారా కంప్యూటర్ ల్యాబ్, ఐదు డిజిటల్ తరగతులను ఏర్పాటు చేశారు. శనివారం వీటి ప్రారంభోత్సవం సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం టివి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు మాట్లాడుతూ పాఠశాలలో దాతలు, ప్రజాప్రతినిధులు, స్థానికుల తోడ్పాటుతో పలు అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఉంగుటూరు జెడ్‌పిటిసి కొరిపల్లి జయలక్ష్మి, మానవత సంస్థ రీజనల్ ఛైర్మన్ పుప్పాల గోపీ, కోట్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.అప్పారావు, ఎమ్‌డి.కృష్ణారావు, పి.విష్ణుమూర్తిరామ్, పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ శానం లక్ష్మణరావు, కొంపల్లి శ్రీనివాసరావు, సభ్యులు కానే వీర వెంకట సత్యనారాయణ, కొకుమారి నాగమణి, కొల్లాబత్తుల నాగరాజు, మార్పిన రాము, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాత.. అవస్థల మోత..!

సాగు నుంచి విక్రయం వరకూ అన్నీ కష్టాలే - రోడ్డెక్కిన ఆక్వా రైతులు

వ్యవసాయం అంటే గతంలో ఎంతో గొప్ప.. రైతంటే అదేస్థాయిలో గౌరవం దక్కేది. అయితే పాలకుల అస్తవ్యస్త విధానాలు, ప్రకృతి కన్నెర్ర కారణంగా వ్యవసాయ అంటేనే విముఖత చూపడంతోపాటు రైతుకు రోజురోజుకీ సమస్యలు చుట్టుముడుతున్నాయి. ఫలితంగా జిల్లాలో రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించింది.

సార్వా వరి పంట మాసూళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి కోతలు ప్రారంభమై సుమారు నెల రోజులైంది. గత 20 రోజులుగా మాసూళ్లు పెద్దఎత్తున సాగుతున్నాయి. అయితే ఏటా మాదిరిగానే ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో విఫలమైంది. మాసూళ్లు 50 శాతం దాటినా ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభ దశలోనే ఉండడం గమనార్హం. ఆర్‌బికెల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కేంద్రాల ప్రారంభంలో ఆలస్యంతో ఇప్పటికే రైతులు నానావస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు తమ పేరిట కొనుగోలు కేంద్రాలకు తోలుకోండంటూ దళారులకు ధాన్యం అమ్మేసిన ఘటనలూ ఉన్నాయి. ఎట్టకేలకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమై అక్కడకు ధాన్యం తీసుకెళ్లిన రైతులకు సవాలక్ష సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. తేమశాతం నిబంధన రైతులకు ఇబ్బందికరంగా మారింది. అయినప్పటికీ నానావస్థలు పడి ధాన్యం ఆరబెట్టి రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. అయితే అక్కడ ఆన్‌లైన్ సమస్య రైతులను తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఆర్‌బికెల వద్ద ధాన్యం లోడులతో రైతులు పడిగాపులు పడాల్సి వస్తోంది. దాని ఫలితమే తణుకు మండలం దువ్వలో రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగడం. రైతులు ఆత్మహత్యాయత్నానికి సైతం సిద్ధమయ్యారంటే ఎంత విసిగివేసారి పోయారో అర్థం చేసుకోవచ్చు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఇలాకాలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో మంత్రి జోక్యం చేసుకుని ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి ధాన్యం మిల్లులకు తరలించాలని ఆదేశించడంతో కొంత సమస్య పరిష్కారమైంది. అయితే మిగిలిన ప్రాంతాల రైతుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగానే మిగిలింది. అదే సమయంలో రైతులను గోనె సంచుల సమస్య వెంటాడుతోంది. దిగుబడికి అనుగుణంగా రైతులకు అవసరమైన గోనె సంచులు ఇవ్వకుండా ఎకరాకు కేవలం 60 సారలకు సంబంధించి సంచులే ఇవ్వడంతో మిగిలిన ధాన్యాన్ని ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. హమాలీల ఛార్జీ, రవాణా ఛార్జీలు ఎప్పటికొస్తాయో అర్థం కావడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. మొత్తంగా అష్టకష్టాలు పడి ధాన్యం పండించిన రైతుకు ఆ పంట అమ్ముకునే సమయంలోనూ ప్రభుత్వ విధానాలతో తిప్పలు తప్పడం లేదని ఇటీవల జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాలు చెప్పకనే చెబుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి రైతులకు అనుకూల విధానాలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆక్వా రైతులు రొయ్యలు వంద కౌంట్‌కు కనీసంగా రూ.240 తగ్గకుండా ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రమైన ఉండిలో పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. సమస్యను పరిశీలించి పరిష్కరించాల్సిన బాధ్యత ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులపై ఉంది. అయితే దానికి భిన్నంగా అధికార, ప్రతిపక్షాలు ఒకరిపై ఒకరు విమర్శలకు దిగడం గమనార్హం. మొత్తంగా ఆక్వా రైతు సమస్య మాత్రం అపరిష్కృతంగానే మిగిలిపోతుంది. కారణాలేవైనా ఎగుమతులు తగ్గిన మాట వాస్తవం. అయితే ఆ పేరుతో ధర తగ్గించి కొనడం మన రొయ్య వ్యాపారులకు చాలాకాలంగా ఒక అలవాటుగా మారింది. దీనిపై ప్రభుత్వ పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడమే కారణం. ఇప్పటికైనా ప్రభుత్వం రంగంలోకి దిగి కచ్చితంగా ప్రభుత్వం ప్రకటించిన ధర అయినా రైతుకు దక్కేలా కఠిన చర్యలు చేపట్టాల్సి ఉంది. లేనిపక్షంలో అటు వరి రైతులు, ఇటు ఆక్వా రైతులు సాగుకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

ఎస్ఐను అభినందిస్తున్న ఎస్‌పి

మండవల్లి ఎస్ఐ, కానిస్టేబుల్‌కు ఎస్‌పి అభినందన

ప్రజాశక్తి - మండవల్లి

ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి కృషి చేసిన ఎస్ఐ రామకృష్ణ, కానిస్టేబుల్ నూరుల్లాలను జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ అభినందించారు. తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతి అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్‌పి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, నగదు బహుమతి అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఇచ్చిన సూచనలు, సలహాల మేరకు కేసులు పెట్టుకున్న ఇరుపక్షాలతో చర్చించి, సానుకూలపర్చి వారి అంగీకారం మేరకు కేసులు రాజీ చేశామన్నారు. సిబ్బంది సానుకూలంగా స్పందించి సహకరించడం వల్లే కేసుల రాజీలో ఏలూరు జిల్లాలో రెండో స్థానంలో, సబ్‌డివిజన్‌లో మొదటి స్థానంలో ఉన్నామని తెలిపారు. ఎక్కువ కేసులు రాజీ చేయడంలో సహకరించిన ఎఎస్ఐ కాకొల్లు రాజుకు, సిబ్బందికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ లేఅవుట్‌లో చదును పనుల అడ్డగింత

రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆపాలని గిరిజన సంఘం ఆందోళన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగించడం దారుణమని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలో రెవెన్యూ సర్వేనెంబర్ 102/1ఎలో 3.62 ఎకరాల భూమిని బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో చదును చేస్తుండగా గిరిజన సంఘం నేతలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో గిరిజన చట్టాలను అతిక్రమిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భోగవల్లి ప్రసాదరావు సర్వే నెం 102/1ఎలో 3.62 ఎకరాల్లో కొబ్బరి తోట ఉందన్నారు. ఆ భూమిలో ఇళ్ల నిర్మాణం కోసం ప్లాట్లు ఏర్పాటు చేశారన్నారు. జంగారెడ్డిగూడేనికి చెందిన సింహాద్రి బ్లేడ్ ట్రాక్టర్‌ను లేఅవుట్ ప్రాంతాన్ని చదును చేసేందుకు పంపించారన్నారు. లక్ష్మడుగూడెం పంచాయతీ ఉప సర్పంచి పదవిలో ఉంటూ ఈ ప్రాంతంలో భూమిని ఇళ్లస్థలాలుగా అమ్మేందుకు అక్రమంగా లేఅవుట్ చేయడం బాధాకరమన్నారు. దీనిపై తహశీల్దార్‌కు సమాచారం అందించగా విఆర్ఒ ఆశాబిను పంపించారు. విఆర్ఒ అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకని అక్కడ నుంచి ట్రాక్టర్‌ను పంపించివేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షుడు కారం భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ పాల్గొన్నారు.

ట్రాక్టర్ వద్ద గిరిజన నేతలు

కళ్లాల్లోనే ధాన్యం కొనాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిబంధనలు సడలించి రైతుల వద్ద నుంచి ధాన్యం కళ్లాల నుంచే కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం కౌలురైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మండలంలో సార్వా ధాన్యం కోతలు జరుగుతున్నాయని, ప్రభుత్వ నిబంధనలు రైతులకు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. విక్రయించిన ధాన్యానికి రైతులకు నాలుగైదు నెలల వరకూ సొమ్ము ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ఈ సీజన్‌లోనైనా ధాన్యం విక్రయించిన పది రోజుల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మురాల రాజేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహాంకాళిరావు, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు ఉల్లంకి నాంచారయ్య, మండల కార్యదర్శి చిన్నం మాధవ, నాయకులు దాకరపు నాగేశ్వరరావు, గద్దె అనిల్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నేతలు

'స్పందన'లో ఫిర్యాదుపై సబ్ కలెక్టర్ విచారణ

ప్రజాశక్తి - ముసునూరు

స్పందన కార్యక్రమంలో బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మండలంలోని కాట్రేనిపాడు గ్రామం వచ్చారని తహశీల్దార్ దాసరి సుధ తెలిపారు. కాట్రేనిపాడుకు చెందిన ఒక వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళకు ఐదు సెంట్లు సొంత స్థలంలో పాటు, సెంటున్నర పోరంబోకు భూమిని విక్రయించారు. ఆ సెంటున్నర భూమిని పంచాయతీవారు దారికి ఉపయోగించుకున్నారు. దీనిపై ఆమె స్పందనలో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు సబ్ కలెక్టర్ విచారణకు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు.

చింతలపూడి తహశీల్దార్‌గా కృష్ణజ్యోతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి తహశీల్దార్‌గా ఎ.కృష్ణజ్యోతి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. కొయ్యలగూడెంలో, ఉంటిలో పనిచేసిన ఆమె బదిలీపై చింతలపూడికి వచ్చారు.

మద్ది ఆదాయం రూ.3.71 లక్షలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి ఒక్కరోజు ఆదాయం రూ.3,71,535 సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.కొండలరావు తెలిపారు. శనివారం కార్తీక మాస ఉత్సవాల నేపథ్యంలో ఆలయానికి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో ఆన్లైన విరాళాలు రూ.74,443, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,60,675, ఇతర సేవల ద్వారా రూ.1,36,417 వెరసి ఆలయానికి రూ.3,71,535 ఆదాయం సమకూరిందని తెలిపారు. జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ఆలయ ధర్మకర్తలు మల్లీడి మోహనకృష్ణ, ఇట్ల నాగలక్ష్మి పర్యవేక్షణలో యాత్రికులకు సేవలు అందించారు.

ఏలూరులో ప్రాఫిట్ షూ బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక ఆర్ఆర్.పేటలో ప్రాఫిట్ షూ కంపెనీ 103వ బ్రాంచ్‌ను ఆ సంస్థ ఛైర్మన్ బోడేపూడి శివ కోటేశ్వరరావు తనయుడు బోడేపూడి వైశాఖ్‌లో శనివారం ప్రారంభించారు. ఏలూరు ఎంఎల్ఎ, మాజీ డిప్యూటీ సిఎం ఆళ్ల నాని, దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయచౌదరి ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ డైరెక్టర్ తేజ మాట్లాడుతూ ఏలూరు నగర వాసులకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలకు చెందిన షూస్, చప్పల్స్‌ను తక్కువ ధరకు అందించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. అనంతరం ఏలూరులోని పలువర్గ వికలాంగుల శరణాలయానికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలగర వెంకట శివరామకృష్ణ, జోనల్ మేనేజర్ ఎన్.సతీష్, ఏరియా మేనేజర్ రవికాంత్, బ్రాంచ్ మేనేజర్ వి.భరత్ పాల్గొన్నారు.


ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

ఏజెన్సీలో రహదారులకు నిధులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఏజెన్సీ ప్రాంతంలో రహదారులకు నిధులు మంజూరు చేయనున్నట్లు ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. మండలంలోని దర్భగూడెం పంచాయతీలోని మారుమూల ఏజెన్సీ గ్రామాల్లైన మడకవారిగూడెం, పందువారిగూడెం, బీమలవారిగూడెం, తపస్వి వారిగూడెంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బాలరాజు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారులకు కూడా నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

పలు శాఖల అధికారుల తీరుపై ఎంఎల్ఎ ఆగ్రహం

ఏజెన్సీ గ్రామాల్లో తిరుగుతున్న ఎంఎల్ఎకు ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రోడ్లు, ఇళ్లు, లేవల కరెంట్ వాటర్‌ట్యాంక్‌కు కూడా మరమ్మతులు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు విన్న ఎంఎల్ఎ పలు శాఖల అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల మంజూరైనా ఒక్క ఇల్లు నిర్మాణం చేపట్టకపోవడంతో హౌసింగ్ ఎఇ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ ట్యాంకుల మరమ్మతులు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కొర్సా పోసమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంతరావు, వైస్ ఎంపిపి సోమాని శ్రీనివాసరావు, సర్పంచి సున్నం ఉషారాణి, సీనియర్ నాయకులు కొల్లారి రాంబాబు, గుండపల్లి శ్రీనివాసరావు, బోధా శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సొసైటీ చైర్మన్, సర్పంచి కుంజ పార్వతి, రాముడు, ఎంపిడిఓ మంగతాయారు, ఎంఈఓ శ్రీనివాస్, డిటి రెండిసేట్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం శనివారం కళాశాల ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కళాశాల అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం ప్రిన్సిపల్ నిర్మలకుమారిని పుష్ప గుచ్ఛాలు అందించి శాలువా కప్పి పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు టి.అక్కరాజు, కె.స్వరూపారాణి, శారదాదేవి, ఎన్ఎస్ఎస్ అధికారి డివివి.చినసత్యనారాయణ పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామస్తులు వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ కోరారు. ముదినేపల్లిలోని అంబేద్కర్‌నగర్‌లో శనివారం 104 వైద్య సేవలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు అంబేద్కర్ నగర్‌లో 104 వాహనం ద్వారా వైద్య సేవలు ప్రజలకు అందలేదన్నారు. జకమంది ప్రతినిధుల మూడో శనివారం అంబేద్కర్‌నగర్‌లో 104 వాహనం ద్వారా వైద్య సిబ్బంది ప్రజలకు వైద్యసేవలు అందిస్తారన్నారు. శిబిరంలో డాక్టర్ కెఎల్.కాంతారావు పాల్గొని 50 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో డిఊ జి.రవితేజ, ఎఎన్ఎం నిమ్మగడ్డ బేబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పాఠశాలలో పురుషుల దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు

శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గొల్లపల్లిలో మహిళా ఉపాధ్యాయులు, మహిళా ఉద్యోగులు సంయుక్తంగా శనివారం అంతర్జాతీయ పురుషుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషులను సన్మానించి, బహుమతి ప్రదానం చేశారు. మహిళా ఉపాధ్యాయులు పద్మ మాట్లాడుతూ పురుషులు, స్త్రీలు సోదర భావంతో కలిసి మెలిసి ఒక కుటుంబంలా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్వరి, కృష్ణవేణి, శివ నాగమణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, దుర్గారాణి, ధనలక్ష్మి, మరియమ్మ, బాలమ్మ, క్లర్క్ రిసోర్స్ పర్సన్ రాంబాబు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్థానిక 48వ డివిజన్‌లో ముట్టకోసేరు చెరువు శ్మశాన వాటికలో అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు తొలగించారు. ప్రజలు అభ్యంతరాల మేరకు ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఏలూరు నగరాభివృద్ధిలో భాగంగా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎంఎల్ఎ ఆళ్ల నాని ఆదేశాల మేరకు ప్రభుత్వ స్థలాలను, శ్మశాన వాటిక స్థలాలను సంరక్షించి స్మృతి వనాలను ఏర్పాటు చేసి పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారు. స్థానిక అశోక్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించిన విషయం విదితమే. ఏలూరు నగరపాలక సంస్థ ద్వారా శ్మశాన వాటికలో స్మృతివనం నిర్మాణం, మృతదేహాల తరలింపునకు రెండు ఉచిత కైలాస రథాల ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ చేపట్టారు.

21 నుంచి సంక్షేమ హాస్టళ్ల పోరుబాట

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ ఏలూరు జిల్లా పరిధిలోని సంక్షేమ వసతి గృహాలను పరిశీలించి, అక్కడ విద్యార్థుల సమస్యలను తెలుసుకొని దుకు వారితో మమేకమవుతామని, దీనికిగానూ సంక్షేమ హాస్టళ్ల పోరు బాట కార్యక్రమం చేపడుతున్నామని టిఎన్ఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ తెలిపారు. స్థానిక అమీనాపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా సంక్షేమ, గురుకుల వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని కోరారు. సన్న బియ్యం సరఫరా చేయాలని, కాస్మోటిక్ ఛార్జీలు పెంచి సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదనపు మరుగుదొడ్లు నిర్మించాలని, రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించాలని, వసతి గృహాల్లో రీడింగ్ రూమ్స్, గ్రంథాలయాలు, కుర్చీలు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ ఏలూరు నియోజకవర్గ అధ్యక్షులు వేగి వినాయక్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అర్థ వెంకటరత్నం, జిల్లా అధికార ప్రతినిధి కొమ్మరెడ్డి మణికంఠ, మారం సూర్య, గుండ్రు రత్నకుమార్, సర్వేశ్వరరావు, రాజేష్, సంజయ్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి - మండవల్లి

లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కైకలూరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్.వృష్ణలత తెలిపారు. మండవల్లి అయ్యవారి రుద్రవరంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పలు శాఖల అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె లబ్ధిదారులతో మాట్లాడారు. ఇల్లు నిర్మించుకోవడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ వివిఎస్.శేఖర్, ఎలక్ట్రికల్ ఎఇ జి.రామకృష్ణ, ఎన్ఆర్ఇజిఎస్ ఇన్‌ఛార్జ్ ఎపిఒ నవీన్ పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని గుళ్లపూడి, గుడిపాడు, రమణక్కపేట గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి డిఎంహెచ్ఓ రవి, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిడిఒ జనార్దనా, అమ్మాజ సత్యనారాయణ, హౌసింగ్ కార్యాలయ సిబ్బంది నాగేంద్రరావు పరిశీలించారు. త్వరగా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

అనారోగ్య బాధితునికి పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అనారోగ్య బాధితునికి డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దాతలు పౌష్టికాహారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక 29వ వార్డు బాలాజీ నగర్‌కు చెందిన సురేష్‌ను స్థానిక ది కలెక్ట్ ఫర్ బైబిల్ టెక్నాలజీ క్రిస్ట్ చర్చ్ ప్రిన్సిపల్ అంబేద్కర్, కరస్పాండెంట్ పి.ప్రేమ్‌కుమార్ శనివారం పరామర్శించి పౌష్టికాహారం అందించారు. త్వరలో నిత్యావసరాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నెలపోలు ప్రభాకరరావు, స్థానికులు పాల్గొన్నారు.

దాకారంలో 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పేరూరు గ్రామ సచివాలయం పరిధి దాకారంలో శనివారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపిపిలు సునీత, రామా, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, దాకారం సొసైటీ అధ్యక్షులు సోమ సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు కె.ప్రవీణ్, నాయకులు బి.శేషుబాబు, శీలం రామకృష్ణ, బేతపూడి ఏసోపురావు, కె.విష్ణువర్ధన, లేళ్ల ఆంజనేయులు, బేతపూడి రమణ, ఎఎం షణ్ముఖసాయి, ఆరేప వెంకటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి టివి.సారధి, కార్యదర్శి రమణ, వీఆర్ఓ రాజబాబు పాల్గొన్నారు.

ఎఎన్ఎంకు అండగా ఉంటాం

ఎన్‌సిడి, ఆర్‌బిఎస్‌కె జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ మానస

ఎఎన్ఎం దుర్గాప్రశాంతిని పరామర్శిస్తున్న మానస

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

లారీ ఢీకొన్న ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన ఎఎన్ఎం పులవల్లి దుర్గాప్రశాంతిని నాన్ కమ్యూనికబుల్ డిసీజ్ (ఎన్‌సిడి) రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సిహెచ్.మానస పరామర్శించారు. కొయ్యలగూడెంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎఎన్ఎం పి.దుర్గాప్రశాంతిని ఆమె శనివారం పరామర్శించి ధైర్యాన్ని అందించారు. బోడిగూడెం గ్రామ సచివాలయంలో ఎఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న ప్రశాంతి లారీ ఢీకొన్న ప్రమాదంలో తన రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. వైద్యుల సలహా మేరకు స్థానిక ఆసుపత్రిలో సర్జరీ చేసి రెండూ కాళ్లను తొలగించారు. దీంతో కాళ్లు కోల్పోయిన తనకు ఉద్యోగం తొలగిస్తారేమో ఆందోళనతో ఉన్న ప్రశాంతికి ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.మానస ధైర్యాన్నిస్తూ కృత్రిమ కాళ్లు అమర్చుతామని, ఉద్యోగం కోల్పోదని పరిస్థితి లేదని భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం అందించేందుకు సహకరిస్తామన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి జీతం అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

కొయ్యలగూడెంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను, ఎస్‌సి బాలికల వసతి గృహాన్ని ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సిహెచ్.మానస పరిశీలించారు. ఆమెతో పాటు తహశీల్దార్ పి.నాగమణి ఉన్నారు.

విద్యార్థులకు అండగా పోలీస్‌శాఖ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పోలీస్ శాఖ నుంచి విద్యార్థులకు ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పోలవరం డిఎస్‌పి కె.లతాకుమారి అన్నారు. స్థానిక కళాశాల గ్రౌండ్‌లోని యూన్నీలక్ష్మియా జయంతిని పురస్కరించుకుని అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో మిషన్ సాహసి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన దిశ యాప్ విద్యార్థులకు ఎంతగానో మేలు చేస్తుందన్నారు. తొలుత విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలకు నృత్యాలు చేశారు. స్వీయ రక్షణకు కరాటేలో మెలకువలు చేసి చూపారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్, ఉపాధ్యాయులు ఎస్ఆర్ఆర్.సుబ్రహ్మణ్యం, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నివాస్, ఏలూరు జిల్లా మీడియా కన్వీనర్ చిటికెన రమేష్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కోళ, సూర్యకుమారి, మంజునాథ్, నరేష్, కిరణ్ పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని లోపూడి పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఝాన్సీలక్ష్మీబాయి చిత్రపటానికి జెడ్‌పిటిసి సభ్యులు వరికిటి ప్రతాప్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన

మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - చింతలపూడి

బిఆర్.అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, దళితులకు రాజ్యాధికారం సాధించే దిశగా వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నారని హోంమంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణ పరిధిలో ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలీజా ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన చింతలపూడి నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ఆమె రాష్ట్ర ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఎస్‌సిలకు ఉన్నత పదవులు ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలీజా పాల్గొన్నారు.

'2024లో జగనే సిఎం'

2024లో ముఖ్యమంత్రి మళ్లీ జగన్మోహన్‌రెడ్డే అని బాపట్ల ఎంపి నందిగం సురేష్ అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన చింతలపూడి నియోజకవర్గ దళిత ఆత్మీయ వనభోజన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం ఎంపిని విలేకర్లు మాట్లాడుతూ ప్రజలందరూ సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నారని చెప్పారు.


చింతలపూడిలో మాట్లాడుతున్న తానేటి వనిత

పోలీస్ సిబ్బంది నియామకంపై ప్రభుత్వం దృష్టి

జంగారెడ్డిగూడెం : పోలీస్ సిబ్బంది కొరత లేకుండా నియామకాలపై ప్రభుత్వం నిరంతరం దృష్టి సారిస్తుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక మహిళా శిశుసంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయిబాబా నివాసంలో హోం మంత్రి తానేటి వనిత అల్పాహార విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ ఇన్‌ఛార్జి డిఎస్‌పి స్థానంలో పర్మినెంట్ డిఎస్‌పిని నియమించడానికి కృషి చేస్తానని తెలిపారు. పోలీస్ శాఖలో సిబ్బంది కొరతను అధిగమించడానికి ప్రభుత్వం నియామకాలపై కసరత్తు చేస్తుందన్నారు. ఈ క్రమంలో పట్టణ ప్రముఖులు పలువురు హోం మంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అధికారులు రాకపోతే సమస్యల పరిష్కారమేలా..!

బుట్టాయగూడెం సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ప్రజాప్రతినిధులు

బుట్టాయగూడెం : అధికారులు సమావేశానికి హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఎంపిపి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ప్రజా ప్రతినిధులతో మాట్లాడి సమావేశ నిర్వహణకు ప్రయత్నించారు. బుట్టాయగూడెం మండల సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశా నికి పలు శాఖల అధికారులు రాకపోవడంతో సమస్యలు పై ఎలా చర్చించాలని, ఎలా పరిష్కారమవుతాయని ప్రజా ప్రజా ప్రతి ధులు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. ఎంపిపి కారం శాంతి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీహరి వారితో మాట్లాడారు. అది, కారుల గైర్హాజరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం సమావేశం నిర్వహించారు. ఎంఇఒ టి.బాబూరావు మాట్లాడుతూ నాడు నేడులో కొత్తగా 31 పాఠశాలలు, అంగన్‌వాడీలు మంజూరయ్యాయన్నారు. విద్యార్థులకు సమాజం పట్ల, వివాహం పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో వసతి గృహాల్లో అవగాహనా తరగతులు నిర్వహించాలని ప్రజా ప్రతినిధులు కోరారు. కోట రామచంద్రపురం హాస్పిటల్ వైద్యురాలు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చిన్న వయసులోనే వివాహాలు చేస్తున్నారని, వీరిపై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపిపి మోహన్, కుక్కల వరలక్ష్మి ఇఒపిఆర్‌డి శ్రీహరి, ఎఒ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

సహకార వ్యవస్థ బలోపేతం చేయడంలో సహకార సంఘాలను నష్టాల ఊబి నుంచి బయటకు తెచ్చి లాభాల బాట పట్టించడంలో అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. 69వ అఖిల భారత సహకార వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని భుజబలపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వ్యవసాయ అవసరాలకు అవసరమైన సొమ్మును సహకార శాఖ రుణాలుగా అందిస్తుందన్నారు. గత ప్రభుత్వాలు చూపిన ఉదాసీన వైఖరి మూలంగా అనేక సంఘాలు నష్టాల బారిన పడ్డాయన్నారు. కిందిస్థాయిలో పనిచేసే అధికారుల పనితీరులో లోపం ఉన్నట్లయితే తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి కృష్ణ, డివిజనల్ సహకార అధికారి వెంకటేశ్వరరావు, డిసిఒ శ్రీనివాస్, సబ్ డివిజనల్ సహకార అధికారి అబ్దుల్ హాది, మండపల్లి సహాయ రిజిస్ట్రార్ అంకిరెడ్డి, ముదినేపల్లి సహాయ రిజిస్ట్రార్ శ్రీనివాసగాంధీ, భుజబలపట్నం పిఎసిఎస్ ఛైర్మన్ పెద్దిరాజు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో జ్ఞానం

ప్రజాశక్తి - దెందులూరు

పోతునూరు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు బి.సునీత, ఎస్.స్వర్ణలత, బి.ఉమామహేశ్వరరావు దిశ చట్టం అమలు తీరు గురించి వివరించారు. ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నప్పుడు ఈ దిశ యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. అనంతరం ఎనిమిది నుంచి పదో తరగతి విద్యార్థులకు 'స్వతంత్ర పోరాటంలో మహిళల పాత్ర' గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.ఆసిన్ వల్లి, కె.సూర్యలక్ష్మి, గ్రంథాలయాధికారి దుగ్గిపోగు జాన్‌బాబు పాల్గొన్నారు.

నిడమర్రు : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిడమర్రు శాఖ గ్రంథాలయంలో శనివారం జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు, ఇందిరా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు చెస్ పోటీలు నిర్వహించారు. విజేతలకు 20వ తేదీన బహుమతులు ఇవ్వనున్నట్లు గ్రంథాలయ పాలకులు జి.బాలరాజు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఉపాధ్యాయులు సత్యసుధా, సిఆర్‌పి నారాయణ దాసు పాల్గొన్నారు.

టి.నరసాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ప్రముఖ కవి మల్లెల జయరాజు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథ పాలకులు ఆర్.కిషోర్ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు డాక్టర్ మల్లెల జయరాజు, మరీదు నాగేశ్వరరావు రచించిన కవితలను చదివి, పద్యాలను పాడి విద్యార్థులకు వినిపించారు. ఈ కార్యక్రమంలో విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండవల్లి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్వధార్ ఫౌండేషన్ అధినేత ప్రొఫెసర్ సురాబత్తుల విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ఎంఇఒ రామకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయాల ద్వారా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు, సురాబత్తుల విజయకుమార్, ఎస్ఎం రామకృష్ణ, విద్యా కమిటీ ఛైర్మన్ జోజ్యప్ప, వైస్ ఛైర్మన్ సోనీ కుమార్, ప్రధానోపాధ్యాయులు రక్షణ బక్కవరపు వెంకటేశ్వరరావు, బి.ఆనంద్ ప్రసాద్, సురేష్, ఎ.నాగేశ్వరరావు, కె.సూర్యారావు, కె.మాధ్యురాజు, ప్రధానోపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు మేకలు విద్యార్థులకు గ్రంథాలయ రుసుం చెల్లించి విద్యార్థులను సభ్యత్వ అవకాశాలను కల్పించారు.

చింతలపూడి : చింతలపూడి బాలికల ఉన్నత పాఠశాలలో యూన్నీలక్ష్మీబాయి జయంతి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలు ప్రధానోపాధ్యాయులు మాటూరి వక్తరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చాట్రాయి : చాట్రాయి శాఖ గ్రంథాలయంలో శనివారం మహిళా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి మహిళా పోలీస్ కానిస్టేబుల్ జె.కళావతి పూలమాలు వేసి నివాళులర్పించారు. హైస్కూల్ ఉపాధ్యాయులు చంటిబాబు, సోషల్ మాస్టర్ భిద్రయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి బి.మణికుమారి నిర్వహించారు.

కొయ్యలగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయంలో శనివారం లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాల్లో పశ్చిమ డెల్టా బోర్డు వైస్‌ఛైర్మన్ గంజిమాల దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దిశ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఘంటసాల సీనయ్య, అడ్వకేట్ సోలస పరిణీత, ఉపాధ్యాయులు ఎస్.శివ, సచివాలయ మహిళా కానిస్టేబుల్ పాల్గొన్నారు. ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాముడు తెలిపారు.

గణపవరం : దిశ చట్టం మహిళలకు రక్షణ కవచం వంటిదని గణపవరం సచివాలయ మహిళా పోలీస్ రోజారాణి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థులకు దిశ చట్టం, యాప్ ఉపయోగాలను వివరించారు. అనంతరం చదరంగం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకులు ఎస్.సుభాషిణి, జి.సుబ్బారావు పాల్గొన్నారు.

నూజివీడు : పట్టణంలోని ఎన్ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలో, ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బిహెచ్.శ్రీనివాసరావు అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రామిశెట్టి త్రివేణి దుర్గ మాట్లాడారు. 11వ వార్డు కౌన్సిలర్ గాదిరెడ్డి శ్రీలత, సోషల్ వర్కర్ లలిత, ఉపాధ్యాయులు బత్తుల అనురాధ, ఎన్ఆర్‌బాయ్ బాలికల జెడ్‌పి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.వి.ఆదిలక్ష్మి, మహిళా మిత్ర కొల్లోలు రంగారావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ పోటీలను అడ్వకేట్ ఎస్.కె.ప్రసాదరావు పర్యవేక్షించారు. గొల్లపల్లి గ్రామంలోని బ్రాంచ్ లైబ్రరీలో విద్యార్థి లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ డొక్కు శ్రీనివాసరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రాధికారాణి, ఉపాధ్యాయులు వి.పద్మ, దుర్గారాణి, ఫిజికల్ డైరెక్టర్ పి.రవీంద్ర, గ్రామ సర్పంచి బి.వెంకటేశ్వరమ్మ, ఎంపిటిసి సభ్యులు సుజాత, రుణాల ధనలక్ష్మి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : విద్యార్థి దశ నుంచే దిశ చట్టం మహిళా సాధికారతపై అవగాహన పొందాలని స్థానిక గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ చనమాల సునీత సూచించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మహిళా పోలీసులతో దిశాచట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ క్రీడల పోటీలు నిర్వహించారు.

ఎంబిబిఎస్ విద్యార్థికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎంబిబిఎస్ విద్యార్థికి గరికిపాటి రవి రూ.లక్ష అందించారు. చింతలపూడి పట్టణానికి చెందిన కారుమంచి రేణుక ఎంబిబిఎస్‌లో ఫ్రీ సీటు సాధించింది. చదివేందుకు ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో గరికిపాటి రవి స్నేహితుల సాయంతో రూ.లక్ష అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉన్నత స్థానాలకు ఎదిగి మండలానికి మంచిపేరు తీసుకురావాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చదువుకునేందుకు సాయం అందించాలని కోరతామని బంధువులు తెలిపారు.

26 నుంచి భవన నిర్మాణ కార్మికుల జాతీయ మహాసభ

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 26, 27, 28 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించనున్న అఖిలభారత భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటియుసి అనుబంధం ఏడో జాతీయ మహాసభ జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ముఖ్య సమావేశం చేపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కరోనా కష్టకాలంలో భవన నిర్మాణ కార్మికులు ఎంతో నష్టపోయారన్నారు. వీరికి రావాల్సిన సంక్షేమ పథకాలు నవరత్నాల పేరుతో కోత విధిస్తూ సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేశారని చెప్పారు. సమస్యలపై చర్చించి దేశవ్యాప్తంగా ఒక ఉద్యమ స్వరూపాన్ని తీసుకురావడం కోసం ఈ మహాసభ దోహదపడుతుందని, జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు తుర్లపాటి బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుద్ధిరాజు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

గౌరవనీయులైన ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు వారి కోర్టులో

A.S.S.R.No. 1756/2015 in I.A.No. 296/2021 in I.A.No. 436/2021

పిటీషన్:
జిల్లెళ్లమూడి నరశింహారావు ...అప్పీలెంటు
మరియు
వాడపల్లి నాగమణి ...రెస్పాండెంటు

పై దావాలో మీరు ప్రతివాదులయిన వున్నందు గౌరవనీయులైన జిల్లా కోర్టు ద్వారా మీకు కోర్టు వారి సమన్లు జారీ చేయుచున్నారు, మీరు హాజరు కాకపోవుట వలన మీకు పత్రికా ముఖమున తెలియజేయనైనది ది.21-11-2022వ తేదీ సోమవారం ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని గౌరవనీయులైన జిల్లా జడ్జి వారి కోర్టులో హాజరయ్యి మీ వాదనను దాఖలు తెలియచేయని ఎడల పై దావాను ఏకపక్షంగా నిర్ణయించెదరని తెలియజేయడమైనది.

జిల్లెళ్లమూడి ఎం.వి.వి.ప్రసాదరావు
జిల్లెళ్లమూడి వారి వీధి, తూర్పు వీధి, ఏలూరు. సెల్: 86883 49448

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE : TANUKU
E.A.No. 87/2019 in
E.P.No. 82/2017 in
O.S.No. 76/2007

Between:
Plaintiff /D.Hr: Arava Seetha Devi
మరియు
Defendant /J.Dr:
Bejjavarapu Mutyala Satyanarayana

వాది తరఫున వేయించిన ప్రకటన

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పై నంబరు గ్రంథంలో ప్రతివాది /జె.డి.ఆర్ బెజ్జవరపు ముత్యాల సత్యనారాయణ, తండ్రి: రాములు, డోర్.నెం. 10-19-17బి, శివ వారు, బెజ్జవరపు వారి వీధి, పాతూరు, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా అయిన మీకు కోర్టు వారి ద్వారా మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా దావా సమన్లు పంపినను అందలేదని తెలిసినందున ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టు వారి ఎదుట ది.30-11-2022 సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజర్ అభ్యంతరం తెలియపరచవలసినదిగాను, అట్లు కానిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

K.S.VENKATESWARLU
Advocate for Petitioner /Plaintiff, Tanuku.
Tanuku, 14-11-22. Cell: 91333 91921

ప్రకటన

మహారాష్ట్ర భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, ప॥గో॥జిల్లా

M.V.O.P.No. 46/2019

పిటీషనర్:
మల్లుల కిషోర్ ...పిటీషనర్
అండ్
కొల్లాటి వెంకటేశ్వరరావు & Others ...రెస్పాండెంటు

టు: ఆర్-6:
కొల్లాటి నాగలక్ష్మి, భర్త: లేటు వెంకటేశ్వరరావు @ వెంకటేష్, R/o. వేమలదీవి గ్రామం, నరసాపురం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

మీరు పై తెలిపిన ఎం.వి.ఓ.పి.నెం. 46/2019లో పై తెలిపిన 6వ ప్రతివాది అయివున్నారు. మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకొనక తప్పించుకొని తిరుగుతున్నందున ఇందుమూలముగా తెలియచేయునది ఏమనగా పై తెలిపిన 3వ భీమవరం అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు యొక్క ఉత్తర్వు ప్రకారం మీరు డిసెంబరు నెల 9వ తేదీ 2022వ సం॥రం ఉదయం 10:30 ని॥లకు హాజరు కావలెను. లేని ఎడల సదరు కేసు మీకు పరోక్షముగా విచారించి తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 09-12-2022

నిమ్మల వీరవెంకట సత్యనారాయణ
సెల్: 98482 13165
నిమ్మల నవీన్
సెల్: 897812 2722
అడ్వకేట్స్, భీమవరం.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814